సమగ్ర సర్వేకు సహకరించాలి

- వివరాలు ఇచ్చేందుకు భయపడాల్సిన అవసరం లేదు
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్/పరిగి/కొడంగల్, నవంబర్ 6: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కోసం వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. వివరాలు ఇచ్చేందుకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. బుధవారం ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు ఇసాఖాన్‌బాగ్ కాలనీలో, మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామం, పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు, మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో కలెక్టర్ వేర్వేరుగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ ఒక్క ఇంటినీ వదలకుండా ప్రతి ఇంటిని సర్వే చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటిలో ఎంత మంది కుటుంబసభ్యులు, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఇంటి నంబర్ లేని ఇండ్లు ఉన్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం వచ్చిన ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు. బుధవారం నుంచి 8వ తేదీ వరకు సర్వే చేసి ఇండ్ల జాబితాను రూపొందిస్తామన్నారు. ప్రజలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, భరణి పట్టాదారు పాసుపుస్తకం తదితర వాటిని సిద్ధంగా ఉంచుకొని ఎన్యూమరేటర్లకు అందుబాటులో ఉండి సమాచారం ఇవ్వాలన్నారు. సర్వే ఫారంలో ఎట్టి పరిస్థితిలోనూ ఎన్యూమరేటర్లు తప్పులు నింపవద్దన్నారు. ఏవైనా సందేహాలుంటే సూపర్‌వైజర్లు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. సర్వే సందర్భంగా ఇంటిని సందర్శించినట్టు స్టిక్కర్ అతికించాలన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎంపీడీవో, తహసీల్దార్, పరిగిలో డీఆర్‌డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, కొడంగల్‌లో ఆర్‌డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ :గొట్టిముక్కల గ్రామంలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వరి కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలి

వికారాబాద్ : జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 2024-25 సీజన్‌కు సంబంధించిన వరి కొనుగోళ్లపై బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండించిన ధాన్యం గ్రేడ్- ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2300, సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోళ్ల కోసం 126 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిలో 34 ఐకేపీ, 61 పీఏసీఎస్, 31 డీసీఎంఎస్ ఏజెన్సీల ద్వారా 108 కేంద్రాల్లో దొడ్డు రకం వరి ధాన్యం, 18 కేంద్రాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. రైతులు ఆరబెట్టిన, చెత్త, తేమ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు గోనె సంచులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వరి కొనుగోలును వేగవంతం చేస్తూ ఎప్పటికప్పుడు ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరేలా వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ టీడీఆర్‌కు స్పందన కరువు

సిటీబ్యూరో, నవంబర్ 6(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బ్యాంకుకు స్పందన కరువైంది. అందుబాటులోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా.. కొత్త ప్రాజెక్టులు లేక టీడీఆర్ విలువ సమకూరడం లేదు. జీహెచ్‌ఎంసీ తరహాలో భూ నిర్వాసితులకు సాయమందించేలా హెచ్‌ఎండీఏ పరిధిలో కూడా టీడీఆర్ ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ పరిధిలో కొత్త ప్రాజెక్టులు లేక ఆదరణ కరువైంది. హెచ్‌ఎండీఏ డిజిటలైజ్ టీడీఆర్, లెడ్జర్ వంటి సదుపాయాలతో ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ప్లాట్‌ఫాంను రూపొందించారు. హెచ్‌ఎండీఏ టీడీఆర్ ద్వారా భూ సేకరణలో ఆస్తులను కోల్పోయిన బాధితులు పారదర్శకంగా పరిహారాన్ని పొందేలా, క్రయ విక్రయాలకు వీలుగా టీడీఆర్ ఆన్‌లైన్ పోర్టల్‌ను అధికారులు రూపొందించారు. కోల్పోయిన స్థలానికి మార్కెట్ ధరకు అనుగుణంగా రెండు నుంచి నాలుగు రెట్ల వరకు టీడీఆర్‌లు పొందే వీలు ఉండగా, ఆన్‌లైన్‌లోనే భూ నిర్వాసితులు క్రయవిక్రయాలు నిర్వహించుకోవచ్చు. ఇక హెచ్‌ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్లన్నింటినీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తుండగా, కొనుగోలు చేసిన టీడీఆర్‌తో అదనపు నిర్మాణాలను చేయవచ్చు. కానీ హెచ్‌ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు ఎలాంటి భారీ ప్రాజెక్టు పనులు చేపట్టకపోవడంతో... భూ నిర్వాసితులకు ఎలాంటి టీడీఆర్ జమ చేయలేకపోయింది. ఈ క్రమంలో అట్టహాసంగా ప్రవేశపెట్టిన టీడీఆర్ బ్యాంక్... ఆరు నెలలు గడిచినా నిద్రావస్థలోనే ఉన్నది.

పాఠశాలలో శుభ్రత పాటించాలి

శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల, కళాశాల తనిఖీ

చేవెళ్ల రూరల్, నవంబర్ 6: పాఠశాలలో శుభ్రత పాటించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం శంకర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలు తెలుసుకున్న అనంతరం.. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గ్రంథాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేస్తానని పకటించారు. పాఠశాల, కళాశాల అభివృద్ధికి రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి
- పోతుగల్‌లో సర్వే పరిశీలన

షాబాద్, నవంబర్ 6: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్‌లో పర్యటించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వే ప్రొఫార్మా ప్రకారం ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలని చెప్పారు. శిక్షణలో సూచించిన అంశాలను జాగ్రతగా గుర్తు పెట్టుకుని సర్వేలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వే నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఇండ్ల వద్దకు సర్వే కోసం వచ్చిన అధికారులకు ప్రజలు తమ పూర్తి వివరాలు అందించాలని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే సర్వేను ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట షాబాద్ ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఆశోక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోతుగల్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

సస్యరక్షణ కోసమే మొబైల్ యాప్

రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో రైతులకు సస్యరక్షణ యాప్‌తో అవగాహన కల్పిస్తున్న డీఏవో నరసింహారావు తదితరులు

- ఆదర్శ రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి నరసింహారావు

మణికొండ, నవంబర్ 6: ఆధునిక యుగంలో వ్యవసాయాన్ని మరింతగా విస్తరింపజేయాలనే సంకల్పంలో భాగంగా పంటలకు సోకే తెగుళ్లను ముందుగానే గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మొబైల్‌యాప్‌ను ప్రవేశపెట్టిందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు అన్నారు. రైతులు ఇలాంటి అధునాతన పద్ధతులను వినియోగించి అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని రైతు శిక్షణా కేంద్రంలో బుధవారం కేంద్ర సమగ్ర సస్య రక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 10 మంది ఆదర్శ రైతులకు మొబైల్‌యాప్ ద్వారా కలిగే ఉపయోగాలను పంట పొలాల వద్ద వినియోగించి అవగాహన కల్పించారు. ఈ యాప్‌తో పంటలకు చీడ, పీడలను ఎలా గుర్తించాలి, వాటి మీద ఎలా నిఘా పెట్టాలి, నివారణ చర్యలు ఎలా తీసుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పంటలకు వచ్చిన తెగుళ్లను ముందుగానే యాప్‌తో గుర్తించి వాటికి అవసరమైన మందులను సైతం యాప్ ద్వారా తెలుసుకునే వీలవుతుందన్నారు. సత్వర నివారణ చర్యలతో పాటు రాబోయే కాలంలో వచ్చే చీడ, పీడలను గుర్తించి తెలుసుకునే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర సమగ్ర సస్య రక్షణ అధికారులు వెంకట్‌రెడ్డి, ఉదయ్‌శంకర్, శ్వేత, సుధ, వ్యవసాయ ఉప అధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తాం

- ప్రతి కార్యకర్త ప్రజల పక్షాన పనిచేయాలి
- ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎండగట్టండి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- చౌదరిగూడలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం
- కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్, నవంబర్ 6: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని, అందుకు కార్యకర్తలంతా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం చౌదరిగూడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అంటేనే తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ అని అన్నారు. రాష్ట్రాన్ని సాధించుకోవడంతో పాటు పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల పాటు తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్ పాలనకే దక్కిందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త పని చేయాలని, ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడ ప్రత్యక్షమై ప్రజల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా కార్యకర్తలకు సమస్యలు ఎదురైతే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎక్కడికక్కడ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఇప్పటి నుంచే కలిసి కట్టుగా ప్రజల పక్షాన పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండాదే విజయం అనే విషయాన్ని కార్యకర్తలు గ్రహించాలని చెప్పారు. చౌదరిగూడలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని, కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకొని మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హఫీజ్, బాబూరావు, రాములు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ముకునూరు గ్రామపంచాయతీలో పలు రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ముకునూరులో కేంద్ర బృందం పర్యటన

పల్లె ప్రకృతివనం, గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై కితాబు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 6: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం, కంపోస్టుయార్డు, ఫాంపాండ్స్‌తో పాటు గ్రామాల్లోని మౌలిక వసతుల కల్పనపై ఎన్ఐఆర్‌డీ కేంద్ర బృందం కితాబిచ్చింది. మండల పరిధిలోని ముకునూరులో బుధవారం ఎన్ఐఆర్‌డీ కేంద్ర బృందం సభ్యులు భక్తవాత్సల్యాతిరుమలన్, సుందరపాండ్యన్ పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతివనం, కంపోస్టు యార్డు, చెత్తసేకరణ ట్రాక్టర్‌తో పాటు గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అలాగే డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు పొందుతున్న లాభాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించడంపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమ్మ, ఎంపీవో లక్‌పతినాయక్, ఏపీఎం రవీందర్, ఏపీవో తిరుపతి చారి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ సేవ సాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్

మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దు

వికారాబాద్, నవంబర్ 6: మైనర్లకు వాహనాలు ఇస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని న్యాయ సేవ సాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు చట్టాలపై అవగాహన కార్యక్రమన్ని నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. వాహనం నడిపే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులపై కేసు నమోదు అవుతుందన్నారు. న్యాయపరంగా చిక్కులు ఎదురవుతాయని తెలిపారు. వాహనానికి తప్పని సరిగా ప్రమాద బీమా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు న్యాయమూర్తి డీబీ శీతల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ హెడ్ న్యాయవాది వెంకటేశ్, డిప్యూటీ లీగల్ హెడ్ న్యాయవాది రాము, న్యాయవాది అవుటి రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాకా వెంకటేశం, ఉపాధ్యాయులు కరుణాకర్, జనార్దనరెడ్డి, విజయలక్ష్మి, మహేశ్వరి, సరస్వతి, హరిచందర్ పాల్గొన్నారు.

కాంసన్ హైజెన్ కేర్ పరిశ్రమలో మంటలు చెలరేగడంతో వ్యాపించిన పొగ

కాంసన్ హైజెన్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- తప్పిన ప్రాణ నష్టం
- మంటలను అదుపుచేసిన ఫైర్ సిబ్బంది
- రూ.30కోట్ల ఆస్తి బుగ్గిపాలు

నందిగామ, నవంబర్ 6: మండల పరిధిలోని కాంసన్ హైజెన్ కేర్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు గుర్తించారు. పరిశ్రమలోని డైపర్ తయారీ ప్లాంట్లో మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో పరిశ్రమలో 50 మంది కార్మికులు పని చేస్తున్నారు. మంటలను అదుపు చేసేందుకు షాద్‌నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ల నుంచి ఫైర్ ఇంజన్లను తెప్పించారు. ఫైర్ సిబ్బంది, స్థానిక పోలీసుల సహాయంతో గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అప్పటికే పరిశ్రమ షెడ్డు మొత్తం కాలిపోయింది. షెడ్డులో రూ.30 కోట్ల విలువ చేసే మిషినరీ, మెటీరియల్ పూర్తిగా కాలిపోయాయి. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ప్రాణ నష్టం, ఎలాంటి గాయాలు కాలేదని నిర్వాహకులు తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం, సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నందిగామ పోలీసులు తెలిపారు.

బాధితులకు భరోసా కల్పించాలి

నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను సంర్శించిన మల్టీజోన్ 2 ఐజీపీ వి.సత్యనారాయణ

- - ప్రతి ఫిర్యాదుపై స్పందిస్తూ.. వారితో మర్యాదగా వ్యవహరించాలి
- మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ
- నవాబుపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

నవాబుపేట, నవంబర్ 6 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి, విచారణ జరిపి, బాధితులకు పూర్తి భరోసా, ధైర్యాన్నిచ్చేలా పోలీస్ అధికారులు పనిచేయాలని మల్టీజోన్-2 ఐజీపీ వి.సత్యనారాయణ సూచించారు. బుధవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలు, క్వార్టర్స్ భవనం, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు, కేసులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ.. విధుల నిర్వహణలో ఉన్న ప్రతి పోలీసు అధికారి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వారి నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసి పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడికి సత్వర న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. డయల్ 100కు కాల్ చేసిన వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిఘా పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, గంజాయి, డ్రగ్స్, గుట్కా తదితర మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘాతో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు ఐజీపీకి ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది గౌరవవందనం చేసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సీఐ నవీన్ కుమార్, ఎస్సై అరుణ్ కుమార్, ఏఎస్సైలు మురళీధర్, యాదగిరి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలి

వికారాబాద్, నవంబర్ 6 : గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి వికారాబాద్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, చంద్రయ్య మాట్లాడారు. కనీస వేతనం రూ.26వేలు, 5 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు కార్యకర్తలు వాటర్‌మెన్, డ్రైవర్లు, కారోబార్స్, స్వీపర్స్ ఎలక్ట్రీషియన్ కుమార్, రాజు, శివ, ఆనంతమ్మ, సరస్వతి, శ్యామలమ్మ, వెంకటప్ప, దస్తప్ప, వెంకటమ్మ, నర్సింహులు, బండప్ప, శంకర్, సాయమ్మ, అశప్ప, వహీద్, శాంతమ్మ, సత్యమ్మ, యాదయ్య, రాములమ్మ, చంద్రప్ప, శాంతమ్మ, బాలయ్య పాల్గొన్నారు.

రియల్ వెంచర్లే టార్గెట్

- విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠా
- అరెస్ట్ చేసిన షాద్‌నగర్ పోలీసులు

షాద్‌నగర్, నవంబర్ 6 : రియల్ వెంచర్లను టార్గెట్ చేస్తూ.. విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను షాద్‌నగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ దొంగల ముఠా వివరాలను వెల్లడించారు. శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన కట్ట శ్రీనివాస్, పెద్ద తుప్పర గ్రామానికి చెందిన కాకునూరి శ్రీకాంత్, నల్గొండ జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన బానోతు రాజు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బిజునూరు జిల్లా రాయిపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోట్‌ఖాధర్ గ్రామానికి చెందిన దీల్వర్ ఓ ముఠాగా ఏర్పడి రాత్రి వేళ్లలో రియల్ వెంచర్లలో ఉన్న అల్యూమినియం, ఇనుప విద్యుత్ తీగలను చోరీ చేసి సొమ్ముచేసుకునేవారు. వీరిపై సైబరాబాద్ పరిధిలోని షాద్‌నగర్, తలకొండపల్లి, కడ్తాల్, నందిగామ, శంషాబాద్ పోలీస్‌స్టేషన్లలో, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం, కందుకూరు, మంచాల పోలీస్‌స్టేషన్లలో, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన మాధవ వర్మ అనే వ్యక్తి తమ వెంచర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు చోరీ చేశారని గత నెల 20న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకొన్నారని తెలిపారు. వారి నుంచి రూ.12.5 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, అశోక లేల్యాండ్ మినీ ట్రక్ వాహనం, మహీంద్ర మినీ ట్రక్ వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభను చూపిన పోలీస్ సిబ్బందిని పోలీస్ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.